25.9.2000 సాయంత్రం శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము

# అపవిత్రతను నిర్మూలించునదే నిజమైన విద్య

నేటి విద్య తెలివితేటలనే పెంచు
కొంచెమైన గుణము పెంచబోదు
కోటి విద్యలుండి గుణము లేకున్నచో
ఫలమదేమి? వాని విలువదేమి?

ప్రేమస్వరూపులారా! అనాదికాలమునుండి భారతీయులు ఈ విశాలమైన చరాచర జగత్తును ప్రపంచమని పిలుస్తూ వచ్చారు. ప్రపంచమనగా పంచభూతములయొక్క ప్రకాశమే. ఈ పంచభూతములను భారతీయులు అనాది కాలమునుండి దైవ స్వరూపాలుగా భావించి పూజిస్తూ వచ్చారు. భూమిని భూదేవియని, జలమును గంగాదేవియని, అగ్నిని అగ్నిదేవుడని, గాలిని వాయు దేవుడని, ఆకాశమును శబ్దబ్రహ్మమని పిలుస్తూ వచ్చారు. ఈనాటి విద్యార్థులు కేవలం దృశ్యపరిశీలన మాత్రమే చేస్తున్నారుగాని, అనాది కాలమునుండి దైవస్వరూపాలుగా ఆరాధింపబడుతున్న ఈ పంచభూతముల పవిత్రతను గుర్తించి వర్తించడానికి ప్రయత్నించటం లేదు. అధ్యాపకులుకూడా వీటివిశిష్టతను బోధించటం లేదు. కనుకనే, ఈనాడు పంచభూతాలు మలినమైపోయాయి. తత్ఫలితంగా మానవులు జీవితంలో భద్రతను కోల్పోతున్నారు. ఈనాటి విద్యార్థులు ముఖ్యంగా చేయవలసింది గ్రంథపరిచయాన్ని పెంచుకోవటం కాదు; పంచభూతాలను పరిశుద్ధం గావించే చర్యలను చేపట్టాలి. ఇదియే ఈనాడు ప్రపంచానికి కావలసిన ప్రధానమైన విద్య. గ్రంథపరిచయంతో డిగ్రీలు తీసుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదు. ప్రతి విద్యార్థి తన నిత్యజీవితంలో పంచభూతాలను సద్వినియోగపరచుకొనే విధానాన్ని గుర్తించి వర్తించాలి. ఈనాడు మనం తినే తిండి, త్రాగే నీరు, పీల్చే గాలి అన్నీ కలుషితమైపోయినాయి. పంచభూతాలు మలినమైపోయాయి. కనుక, విద్యార్థులు చదువుతోపాటు పంచభూతాలను పరిశుద్ధం గావించే ప్రయత్నానికి పూనుకోవాలి. మొట్టమొదట తమ గృహమును, స్కూలును, పరిసరాలను పవిత్రం గావించాలి. Cleanliness is Godliness. మీరు పవిత్రంగా ఉండాలి. మీరు చేసే ప్రతి పనీ పవిత్రంగా ఉండాలి.

sri sathyasai vachanamrutam

అందునిమిత్తం మొట్టమొదట మీ భావాన్ని పరిశుద్ధం చేసుకోవాలి. భారతీయ సంస్కృతి "సత్యం వద, ధర్మం చర" అని బోధించింది. సత్యమును పలకాలి. అది సర్వత్ర వ్యాపించి మనం పీల్చుకునే గాలిని పరిశుద్ధం గావిస్తుంది. అందరినీ ప్రేమించాలి. ఎందుకంటే "ఈశ్వర స్సర్వభూతానాం" అందరియందు భగవంతుడున్నాడు. భగవంతుడు విశ్వస్వరూపుడు. ఈ ప్రకృతి భగవంతునియొక్క అంగము. కాబట్టి దీనిని సరియైనరీతిలో అనుభవించాలి.

## సైన్సు తెచ్చిపెడుతున్న పెద్ద ప్రమాదం

ఈనాడు మానవుడు స్వార్థపరుడై భూమినుండి ఆయిల్, పెట్రోల్, ఐరన్ మున్నగు అనేక వనరులను అపహరిస్తున్నాడు. అంతేకాదు. సముద్రమునందు దినమునకు కొన్ని కోట్ల ప్రాణులను హతమార్చుతున్నాడు. తద్వారా Ecological Balance (పర్యావరణ సమతౌల్యము) దెబ్బతిని భూకంపాలవంటి అనేక ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. Ecological Balance ను కాపాడినప్పుడే మానవత్వం ధన్యమౌతుంది. కాని ఈనాడిది పూర్తిగా క్షీణించి పోయింది. ఇది సైన్సు తెచ్చిపెడుతున్న పెద్ద ప్రమాదం. సైన్సు అభివృద్ధి కావలసిందే. కాని అది సమాజానికి ఉపకారం చేసేదిగా ఉండాలి. సమాజ సంక్షేమాన్ని గూర్చి ఎవ్వరూ యోచించటం లేదు. అంతా స్వార్థం, స్వార్థం!

ఈనాటి విద్యార్థులు స్వార్థ స్వప్రయోజనాల కోసం విద్యనభ్యసిస్తున్నారు, ధనార్జనకై ప్రాకులాడుతున్నారు. విద్యద్వారా Knowledge ని పెంచుకుంటున్నారేగాని, ఆ Knowledge ని Skill చేయటానికి బదులు చరిజిజి చేస్తున్నారు. కనుకనే, వారి దృష్టి బహిర్ముఖమై అంతర్భావము అడుగున పడిపోతున్నది. తత్ఫలితంగా జీవితంలో Balance ను కోల్పోతున్నారు. Knowledge ని ఐదిరిజిజి చేయాలి. అప్పుడే అంతర్దృష్టి అభివృద్ధి అయి జీవితంలో Balance ఏర్పడుతుంది. ఈనాటి మానవుని యందు Balance శూన్యమై పోయింది. కనుకనే మానవత్వం అదృశ్యమైపోయింది. జీవితంలో Balance ఏర్పడినప్పుడే మానవతావిలువలు అభివృద్ధి అవుతాయి.

## ఎలాంటి విద్యను నేర్వాలి?

ప్రాచీనకాలంలో అధ్యాపకులు విద్యార్థులకు ఉన్నతమైన విలువలను బోధించి వారి

sri sathyasaivachanamrutam

## 25.9.2000 సాయంత్రం శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము

అభివృద్ధికి పాటుపడేవారు. "సద్గుణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనము నేర్పునదె విద్య, విద్యార్థి నేర్వవలయు." ఈనాటి చదువులు విద్యార్థులలో ఆలోచనాశక్తిని, విచక్షణాశక్తిని పెంపొందించడం లేదు. ఆలోచనారహితమైన మేధాశక్తి, విచక్షణారహితమైన నైపుణ్యశక్తి వలన ప్రయోజనం శూన్యం. కాని, విద్యార్థులు ఇలాంటి చదువుకోసమే ప్రయాసపడుతున్నారు. ఇలాంటి చదువు చదువే కాదు. దేశానికి మంచి చేసే చదువు చదవాలి. ప్రజలకు మేలు చేసే చదువు చదవాలి. ఈనాటి విద్యావిధానంలో ఎందరో పెద్దలు ఎన్నో మార్పులు చేశారు. వాటివల్ల ప్రయోజనమేమీ కనిపించటంలేదు. మొట్టమొదట మానవుని మనస్సు మారాలి. మనస్సు మారినప్పుడే మనిషి మారుతాడు. అప్పుడే జగత్తంతా మారుతుంది. "మనో మూలమిదం జగత్" జగత్తంతా మనస్సుతో నిండినది. విద్యార్థులు తాము సంపాదించిన Knowledge ని skill చేయాలి. అప్పుడే వారు జీవితంలో ఆనందాన్ని పొందగలరు. కాని, ఈ విషయం విద్యార్థులకు తెలియటంలేదు. అధ్యాపకులు బోధించటంలేదు. ఈ తప్పు ఎవరిది? కన్న తల్లిదా? పోషించిన తండ్రిదా? విద్య నేర్పించే గురువుదా? లేక, దేశాన్ని పాలించే నాయకులదా? ఈ దోషంలో అందరికీ భాగమున్నది. పిల్లలు ఎంతో పరిశుద్ధమైన మనస్సు గలవారు. తల్లిదండ్రులు మానవతా విలువల ప్రాముఖ్యతను వారికి లేతవయస్సునుండియే ఇంట్లో బోధించాలి. వారిచేత సత్యాన్ని పలికించాలి. కాని, ఈనాడు తల్లిదండ్రులే పిల్లలకు అసత్యాన్ని నేర్పిస్తున్నారు. ఎవరైనా ఫోను అడిగితే, ప్రక్కనే ఉన్న తండ్రి "లేదని చెప్పరా" అంటాడు. ఈరీతిగా పిల్లలు తల్లిదండ్రులనుండి అసత్యం పలకటం నేర్చుకొని, పెద్దవారైన తరువాతకూడా అసత్యాన్నే అనుసరిస్తున్నారు. సత్య,ధర్మ, శాంతి ప్రేమలే మన పంచప్రాణములనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి.

నేను అప్పుడప్పుడు మా పిల్లలకు చెబుతుంటాను – సత్యమనే కరెంటు ధర్మమనే వైరుద్వారా శాంతి అనే బల్బులో ప్రవేశించి ప్రేమ అనే ప్రకాశము నందిస్తుంది. కనుక, ప్రేమ ప్రకాశమును అనుభవించాలంటే సత్యధర్మాలను అనుసరించాలి. "సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం" సత్యమును పలకాలి, ప్రియంగా మాట్లాడాలి, అప్రియమైన సత్యమును పలుకరాదు. ఈ మూడే నైతిక, ధార్మిక,ఆధ్యాత్మిక విలువలు. ఎలాంటి పరిస్థితిలోనైనా అసత్యమాడకూడదు, ఎవ్వరికీ అన్యాయం చేయకూడదు. ఎల్లప్పుడు సహాయమే

sri sathyasai vachanamrutam

చేయాలి. ఎవ్వరికీ బాధ కల్గించకూడదు. ఇవే ఈనాడు పిల్లలు నేర్చుకోవలసినవి. ఇవి నేర్చుకుంటే ఎంతో అభివృద్ధికి రాగలరు. Pollution (అపవిత్రత)ను దూరం చేయునదే నిజమైన Education (విద్య). కేవలం ఎక్కువ మార్కులు తెచ్చుకోవటమే ప్రధానం కాదు, చెడ్డ రిమార్కులు రాకుండా చూసుకోవాలి. అప్పుడే మీరు తెచ్చుకునే మార్కులకి విలువ ఉంటుంది.

చదివి వ్రాయ నేర్చినవారంతా విద్యావంతులేనా?
కాలేజీ డిగ్రీలు పొంద విద్యావంతులగునా?
సుజ్ఞానము, సుకృతి లేని విద్యలు సద్విద్యలగునా?
బ్రతుకుటకే విద్యయన్న బ్రతుకలేవె పశుపక్షులు ?

పవిత్రతను పెంపొందించటమే విద్యయొక్క లక్ష్యం. కేవలం చదవడం వ్రాయటం మాత్రమే విద్య కాదు. ప్రాపంచికమైన విద్య వస్తుంది, పోతుంది, ఆత్మవిద్యయే ప్రధానమైనది.

**వట్టి చేతులతోనే వెళ్ళవలసివస్తుంది**

ఈనాడు గొప్ప గొప్ప విద్యావంతులు, ధనవంతులు ఆధ్యాత్మికమును అలక్ష్యం చేస్తున్నారు. వారికి ధనమే ప్రధానం. కాని, ధనం ఆనందాన్నివ్వదు. దైవభక్తి ఉండాలి. ఈనాడు ప్రజలలో దైవభక్తి క్షీణించటంచేత దేశమే నాశనమౌతున్నది. ధనంకోసం ప్రాణాన్నైనా ఇస్తున్నారు గాని, దైవంకోసం ఒక్క క్షణమైనా ఇవ్వటంలేదు. ధనం ఉండవలసిందే. కాని, మితిమీరితే అది ప్రమాదాన్ని తెప్పిస్తుంది. దైవప్రేమను పెంచుకున్నప్పుడు ధనము దానంతట అదే వస్తుంది. దైవానికి కాలాత్మకుడని పేరు. కాలం భగవత్స్వరూపం. అట్టి కాలాన్ని మీరు ఎంతవరకు సద్వినియోగం చేస్తున్నారు. రోజులో కనీసం ఐదు నిమిషాలైనా పవిత్రమైన పనులు చేస్తున్నారా? న్యూస్‌పేపర్లు చదువుతున్నారు, టీవీ చూస్తున్నారు, వారి చింత, వీరి చింత చేస్తూ కాలం గడుపుతున్నారు. వీటివల్ల కలిగే లాభమేమిటి? ఎంత కాలాన్ని వ్యర్థం చేస్తున్నారో! కాలాన్ని వ్యర్థం చేస్తే జీవితాన్ని వ్యర్థం చేసినట్లే! మీరు గొప్ప ధనవంతులని పేరు పొందవచ్చును. కాని, గుణం లేకపోతే ఎంత ధనమున్నా వ్యర్థమే. మీరు పుట్టినది మొదలు చచ్చేంతవరకు ధనంకోసం ప్రాకులాడుతున్నారు. కాని, మీరు పుట్టింది ధనంకోసం కాదు. "కారే రాజులు?

sri sathyasai vacanamrutam

రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతింబొందరే? వారేరీ? సిరి మూట గట్టుకొని పోవంజాలిరే?" పూర్వం ఎంతోమంది రాజులు రాజ్యాలను పరిపాలించారు. కాని వారేమైనా తమవెంట సిరిమూటగట్టుకొని వెళ్ళగల్గారా? చచ్చే సమయంలో మీరు చిటికెడు మట్టైనా తీసుకుపోగల్గుతున్నారా? బ్యాంకులో పెట్టింది బ్యాంకులోనే నిల్చిపోతుంది; వట్టి చేతులతోనే వెళ్ళవలసివస్తుంది. కనుక ధనవ్యామోహాన్ని వీడి సద్గుణాలను పోషించుకోండి.

## నన్ను మీరు ఆదర్శంగా తీసుకోండి

ప్రేమస్వరూపులారా! పిల్లలుగాని, పెద్దలుగాని ఎవరైనా సరే, మానవత్వాన్ని ధరించిన ప్రతివ్యక్తి దివ్యత్వాన్ని పోషించుకోవాలి. పరాధీనులు కాకుండా పరమాత్మాధీనులు కావాలి. మానవత్వం దివ్యమైనది. మీరు మానవులు కారు, దైవ స్వరూపులే! కాని, మీరు మానవులమని భావించటం చేత మానవులుగానే ఉండిపోతున్నారు. "నేను మానవుడను కాదు, నేనే దైవాన్ని" అన్న సత్యాన్ని మీరు విశ్వసించాలి. దానికి తగినట్లు ధర్మాన్ని అనుసరించాలి. ప్రేమతత్త్వాన్ని పదిమందికి పంచాలి. మనస్సును పవిత్రం గావించుకొని పదిమందికి ఆదర్శంగా నిలవాలి. "వాడు ఎక్కువ సంపాదిస్తున్నాడు. నేను వానికంటే ఇంకా ఎక్కువ సంపాదించాలి" అనే దురాశను వీడాలి. చదువు దేనికోసం? "చదువు చదివి చదివి చావంగ నేటికి? చావులేని చదువు చదువవలయు" అదియే నిజమైన చదువు. ఆ చదువు మీరెక్కడున్నా మిమ్మల్ని కాపాడుతుంది. మీ వద్ద ధనం లేకపోయినా గుణమే ఉంటే, మీరెక్కడున్నా అందరూ మీకు స్నేహితులై మిమ్మల్ని ఆదరిస్తారు. మానవతా విలువలు చదువులవల్ల వచ్చేవి కావు. గురువులు అందించేవి కావు. వాటిని ప్రయత్నపూర్వకంగా సాధించాలి. జీవితం ప్రశాంతంగా గడవాలంటే సత్యధర్మాలను అనుసరించాలి. ప్రారంభంలో కొన్ని కష్టాలు కలుగవచ్చు. వాటిని నెట్టుకొని, తట్టుకొని ముందుకు సాగాలి. దానికి తగిన Patience (శాంతము)ను మీరు సంపాదించుకోవాలి. కాని, అలాంటి Patience మీలో లేకపోవటంచేత మీరు Patient (రోగి)గా మారిపోతున్నారు. Purity (పవిత్రత), Patience (సహనము), Perseverance (పట్టుదల) – ఈ మూడింటినీ పెంచుకోవాలి. ఆశలను తగ్గించుకోవాలి. అప్పుడే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

sri sathyasai vachanamrutam

# 25.9.2000 సాయంత్రం శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము

నన్ను మీరు ఆదర్శంగా తీసుకోండి. నేను దేనిని ఆశించడం లేదు. మీకందరికీ తెలుసు – పుట్టపర్తిలో పెద్ద హాస్పిటల్ కట్టాము, యూనివర్శిటీ ప్రారంభించాము. మనం మంచిభావంతో ఏవి ప్రారంభించినా అవి మంచిగా జరుగుతూ వస్తాయి. నాకున్న కోరిక ఒక్కటే – అందరూ మంచిగా బ్రతకాలి, ఆదర్శప్రాయులుగా నిలవాలి. భజన తరువాత మీరు "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" అంటున్నారు కదా! అందరూ సుఖంగా ఉండాలి. కొందరు మాత్రమే సుఖంగా ఉంటే ప్రయోజనం లేదు. అందరూ సుఖంగా ఉండాలంటే అందరియందు సత్య, ధర్మ, శాంతి, ప్రేమలు ప్రవహించాలి. పిల్లలు చాలా సున్నిత హృదయులు; నిర్మల, నిస్వార్థ భావములు గలవారు. కనుక, వారి హృదయక్షేత్రాలలో సత్య, ధర్మ, శాంతి, ప్రేమలనే బీజాలు నాటితే అవి భవిష్యత్తులో మహావృక్షాలుగా రూపొందుతాయి. వారివల్ల దేశమెంతో బాగుపడుతుంది. కనుక, ప్రైమరీ స్కూలు స్థాయినుండియే పిల్లలకు పవిత్రమైన గుణములను నేర్పించాలి. ఇంట్లో తల్లిదండ్రులు, స్కూల్లో టీచర్లు పిల్లలకు సరియైన రీతిగా తోడ్పడితే పిల్లలెంతో ఉన్నతస్థాయికి చేరుకోగలరు. "త్యజ దుర్జన సంసర్గం, భజ సాధుసమాగమం" చెడ్డవారికి దూరంగా ఉండాలి, మంచివారితో స్నేహం చేయాలి. మీరు మంచిగా నడచుకుంటే, మిమ్మల్ని చూసి చెడ్డవారుకూడా మంచిగా మారిపోతారు.

**మానవతా విలువలను ఆచరించి చూపించాలి**

ప్రేమస్వరూపులారా! భగవంతుడు మీకు నాలుక నిచ్చినందుకు సత్యాన్ని పలకాలి; చేతులనిచ్చినందుకు దానం చేయాలి; చెవులనిచ్చినందుకు పవిత్రమైన విషయాలను శ్రవణం చేయాలి. మీ పంచేంద్రియాలను పవిత్రం గావించుకునే పనులు మీరు చేపట్టాలి. దాని నిమిత్తమే మనం ఇక్కడ ఈ సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. మానవతావిలువలలో విద్యాబోధనకు సంబంధించి జుమ్సాయి (థాయిలాండ్) ఎంతో గొప్ప కృషి చేస్తున్నాడు. అయితే, ఇది ఒక్క మనిషి చేసే పనికాదు. అందరూ కలిసి చేయాలి. ఒక్కదారము వస్త్రమౌతుందా? లేదు. అనేక దారములు చేరాలి.

అదేరీతిగా మన సంస్థ అభివృద్ధి కావాలంటే ఐకమత్యం చాలా అవసరం. ఒకరి తప్పులను ఇంకొకరు సవరించుకుపోవాలి. పిల్లలపై కోపం ప్రదర్శించకూడదు. You cannot always oblige, but you can always speak obligingly. వారితో మెల్లగా,

srisathyasaivahanamrutam

తీయగా మాట్లాడాలి. వారికి తగిన శ్రద్ధతో బోధించాలి. అప్పుడే పిల్లలు ఉత్సాహంగా నేర్చుకుంటారు. లెక్కలను బోర్డు మీద చేసి చూపిస్తే పిల్లలు నేర్చుకుంటారు. ఫిజిక్స్, కెమిస్ట్రీలను పుస్తకాలద్వారా, ప్రయోగాలద్వారా నేర్పించవచ్చును. కాని మానవతావిలువలు పుస్తకాలద్వారా, ప్రయోగాలద్వారా నేర్పించేవి కావు. డ్రిల్లు మాస్టారు డ్రిల్లు నేర్పించేటప్పుడు "వన్, టూ, త్రీ...." అంటూ స్వయంగా చేసి చూపిస్తాడు కదా! అదేరీతిగా మానవతా విలువలను మీరు స్వయంగా ఆచరించి పిల్లలకు చూపించాలి. అప్పుడే పిల్లలు మిమ్మల్ని అనుసరించి ఎంతైనా అభివృద్ధికి వస్తారు. దేశం కూడా బాగుపడుతుంది. ఒక్క దేశమే కాదు. ప్రపంచమే బాగుపడుతుంది. నిజంగా ఈనాడు పిల్లలకు చెప్పేవారు, ఆదర్శాన్ని అందించేవారు లేకపోవటం చేతనే వారు నేర్చుకోవటానికి వీల్లేకపోతున్నది.

ప్రేమస్వరూపులారా! మీరెంతో గొప్ప శ్రీమంతులుగా, విద్యావంతులుగా ఉండవచ్చును. కాని నేను మీ సిరిసంపదలను, మీ విద్యను చూసి మెచ్చుకోను. వాటిని మీరెంతవరకు సద్వినియోగం చేస్తున్నారనేది నేను చూస్తాను. I want only Quality, not quantity. సమాజానికి ఉపకరించని విద్య, సంపద ఎంత ఉండి ఏమి ప్రయోజనం? మీ విద్యను సద్వినియోగం చేసినప్పుడే మీరు నిజమైన విద్యావంతులౌతారు, మీ సంపదను సద్వినియోగం చేసినప్పుడే మీరు నిజమైన శ్రీమంతులౌతారు. మీలో ప్రేమ ఉన్నప్పుడే అందరూ మిమ్మల్ని ప్రేమిస్తారు. నాలో ప్రేమ సంపూర్ణంగా ఉంది కనుకనే ఇంతమంది ఇక్కడకు వచ్చారు. ప్రేమయే అందరినీ ఇక్కడికి రప్పిస్తున్నది.

**మీరు నావారు, నేను మీవాడను**

ప్రేమస్వరూపులారా! మీరెన్నో దేశాలనుండి ఎంతో డబ్బు ఖర్చు పెట్టుకొని ఇక్కడికి వచ్చారు. అంత ఖర్చు పెట్టుకొని, అంత దూరంనుండి వచ్చినందుకు ఇక్కడనుండి అంతో ఇంతో మంచిని తీసుకుపొండి. దహనశక్తి కల్గినదే నిప్పు అవుతుంది; లేనిది కేవలం బొగ్గుగానే ఉంటుంది. అదేరీతిగా, మీరు ప్రేమతత్త్వాన్ని పెంచుకున్నప్పుడే మానవులౌతారు. మీకేమైనా సందేహాలుంటే అడగండి, నేను సులభంగా తీరుస్తాను. నేనెప్పుడూ సిద్ధంగా ఉన్నాను. నన్ను మీరు ఉపయోగించుకోండి. నన్ను మీరుపయోగించుకుంటే మీకెంతైనా మేలుకల్గుతుంది.

srisathyasaivachanamrutam

## 25.9.2000 సాయంత్రం శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము

నేను మీవాడను, మీరు నావారు. మీరు, నేను వేర్వేరు కాదు. మీరు, నేను ఒక్కటే. చాలామంది స్వామికి “థ్యాంక్స్” (కృతజ్ఞతలు) చెబుతుంటారు. ఇది చాలా పొరపాటు. మీరు మీ అమ్మగారింటికి వెళ్ళారు. అమ్మ మీకు అన్నం వండి వడ్డించింది. “అమ్మా! నీవు నాకు అన్నం వండి పెట్టినందుకు “థ్యాంక్స్” అని అంటారా మీరు? అది అమ్మ కర్తవ్యం. దానికి మీరు “థ్యాంక్స్” చెప్పకూడదు. అదేరీతిగా నేను నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను. మీరు నావారు. కనుక స్వామికి మీరు “థ్యాంక్స్” చెప్పకూడదు. మీకు హక్కు ఉంది. మీది Right (హక్కు), నాది Responsibility (కర్తవ్యం).

**(25.9.2000 సాయంత్రం మానవతావిలువలతో కూడిన విద్యాబోధనపై అంతర్జాతీయ సదస్సును ప్రారంభిస్తూ సాయికుల్వంత్ సభా మండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

sri sathyasai vachanamrutam